సమైక్యతా యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

బహిరంగసభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు, హాజరైన భారీ జనసందోహం

పోటెత్తిన..పసుపుదళం

పసుపుమయంగా మహానాడు ప్రాంగణం
వాహనాల రద్దీతో రహదారులు కిటకిట
అడుగడుగునా స్తంభించిన ట్రాఫిక్
ముగిసిన మూడ్రోజుల మహానాడు

సిఎం చంద్రబాబుతో కలిసి అభివాదం తెలుపున్న జిల్లా నాయకులు, ఎమ్మెల్యేలు

కడపలో నిర్వహించిన టిడిపి మహానాడు బహిరంగ సభకు పసుపుదళం పోటెత్తింది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి కార్యకర్తలు, నాయకులు వేలాది వాహనాల్లో చేరుకున్నారు. కడప, రాజంపేట, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, బద్వేల్ ప్రాంతాల నుంచి పలువురు యువకులు బైక్‌లపై మహానాడు బహిరంగసభకు తరలివచ్చారు. గురువారం చివరి రోజు నిర్వహించిన బహిరంగ సభలో కడప జిల్లాకు ఏదైనా భారీ పరిశ్రమను ప్రకటిస్తారనే ఆశలతో పెద్దఎత్తున హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగాన్ని ఆసాంతం ఆసక్తిగా ఆలకించడం కనిపించింది. ఎటువంటి కొత్త ప్రాజెక్టు ప్రకటన చేయకపోవడంతో కాస్త నిరుత్సాహాన్ని కలిగించింది.

సిఎం చంద్రబాబుకు నాగళి అందజేస్తున్న కమలాపురం ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపి రాష్ట్ర మహానాడు బహిరంగ సభ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైంది. మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు అధ్యక్షత వహించారు. ముందుగా రాయలసీమ నాయకుల నుంచి ఐటి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పులివెందుల ఇన్‌ఛార్జి బి.టెక్‌రవి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, కడప పార్లమెంట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులరెడ్డి వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి ధ్వంసమైందని విమర్శించారు. వైసిపి హయాంలో టిడిపి కార్యకర్తలు బయటికి రావడానికి భయ పడేవారని,అటువంటి సమయంలో యువగళం పేరుతో ఐటి, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పాదయాత్ర చేపట్టడంతో పహల్గాం దా డుల తరహాలో వైసిపి పునాధులు బీటలు వారాయన్నారు. తల్లికి, చెల్లింకి న్యాయం చేయలేని నాయకుడు రాష్ట్రానికి ఏమి న్యాయం చేస్తాడని ప్రశ్నించారు.

రింగురోడ్డుపై వాహన రద్దీ..అవస్థల్లో ప్రజానీకం

టిడిపి మహానాడు నిర్వహణ నేపథ్యంలో కడప ఔటర్ రింగు రోడ్డులో వాహనాల రద్దీ నెలకొంది. ఉదయం 7.30 గంటల నుంచే రాష్ట్రంలోని నలుమూలల నుంచి కార్యకర్తలు బహిరంగ సభ వేదికకు చేరుకోవడం మొదలుపెట్టారు. టూరిస్ట్ వాహనాలు, స్కూల్, కాలేజీ బస్సులు, ప్రయివేటు వాహనాలు, కార్లతోపాటు కాలినడకన సైతం తరలివచ్చారు. జిల్లా పోలీస్ అధికారులు 50 వేల వరకు వాహనాలు వస్తాయని అంచనా వేసి, 23 చోట్ల పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాయంత్రం మూడు గంటల సమయంలో ప్రసంగించే వరకు కార్లు, బస్సులు రాకపోకలు కొనసాగుతూనే ఉన్నాయి. పోలీసులు వాటిని పార్కింగ్ స్థలాలకు పంపించడానికి ఆపసోపాలు పడుతూ కనిపించారు. బహిరంగసభకు సమీపంలోని గ్రామాలకు చెందిన వారు

ద్విచక్రవాహనంతో ఆకట్టుకున్న అభిమానులు

కాలి నడకన బహిరంగ సభకు చేరుకుంటూనే కనిపించారు.

లక్షలాది మందికి భోజన సదుపాయం

రాష్ట్రంలోని నలుమూల నుంచి మహానాడు బహిరంగ సభకు బయల్దేరిన ప్రజానీకానికి తిరుపతి ప్రాంతాలకు వెళ్లే వారికి రాయచోటి ఘాట్, కోస్తా ప్రాంతాలకు వెళ్లే వారికి చెన్నూరు, ఖాజీపేట, వల్లూరు, పులివెందుల ప్రాంతాలకు వెళ్లే వారికి వైవీయూ, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లే వారికి రిమ్స్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాతాల్లో పెద్దఎత్తున గుడారాలు వేసి సుమారు లక్షలాది మందికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. రింగురోడ్డుపై బాక్సుల్లో ఆహారాన్ని సరఫరా చేశారు. రెండ్రోజుల పాటు మహానాడు నిర్వహించిన ప్రతినిధుల సభ, పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రాంగణాల్లో మధ్యాహ్న భోజన సదుపాయాలను కల్పించారు. ప్రాంగణాలు వేలాది మందితో ప్రాంగణాలు కిటకిటలా డిపోయాయి.

ట్రాఫిక్ తంటాలతో ఇక్కట్లు

మహానాడు బహిరంగసభా ప్రాంగణానికి బయల్దేరిన కార్యకర్తలకు, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రింగు రోడ్డు పొడవునా అడుగడుగునా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు జోక్యం చేసుకుని క్లియర్ చేసి పంపించడం పరిపాటిగా మారింది. సాయంత్రం ముఖ్యమంత్రి ప్రసంగం అయిపోయిన అనంతరం పలువురు వాహనాలతో ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. మూడ్రోజుల మహానాడు కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో చిరు జల్లులకు పరిమితం కావడం ఉపశమనం కలిగించింది.

టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజును అభినందిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

స్తంభించిన ట్రాఫిక్

రూ.వెయ్యి కోట్లతో జిఎన్ఎస్ఎస్ పనులు

- అన్నమయ్య రిజర్వాయర్‌ను పునరుద్ధరిస్తాం
- 12లోగా 'ఉక్కు' పనులు ప్రారంభిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడి

త్వరలోనే జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు చేపట్టి, కడప నగరానికి నీరందిస్తానని, ఇందుకుగానూ రూ.వెయ్యి కోట్లు కేటాయించామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం టిడిపి రాష్ట్ర మహానాడు బహిరంగ సభకు హాజరైన ప్రజలను, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని అన్నమయ్య డ్యామ్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. 24 వేల ఎకరాలకు సాగు, నాలుగు మండలాలకు తాగునీరు అందుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవుని గడపలో తొలి మహానాడు సూపర్ హిట్ అయిందన్నారు. కడప..తెలుగుదేశం పార్టీ అడ్డా అన్నారు. అది నిరూపించేందుకే ఇక్కడ మహానాడు నిర్వహిoచామన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత నాదన్నారు. రాయలసీమను రాష్ట్రానికి మణిహారంగా మారుస్తామని తెలిపారు. రాయలసీమ అభివద్ధికి బ్లూప్రింట్ ఉందని చెప్పారు. ఆరు నెలల్లో కడప హజ్‌హౌస్ పూర్తి చేస్తామన్నారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుందన్నారు. జూన్ 12లోగా కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు.

అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీతో 'మహానాడు' వద్ద భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి-కడప అర్బన్

'మహానాడు' నేపథ్యంలో గురువారం పబ్బాపురం వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ ద్వారా భద్రతా ఏర్పాట్లను ఐజిపి (ఆపరేషన్స్) సి.హెచ్ శ్రీకాంత్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి స్వయంగా పర్యవేక్షించారు. 23 డ్రోన్లు, 4 అత్యాధునిక 'టెదర్ టెక్నాలజీ' డ్రోన్లను వినియోగిస్తూ భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ సజావుగా సాగేలా, పార్కింగ్, బహిరంగ సభా స్థలి వద్ద ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడూ విహంగ వీక్షణం ద్వారా పర్యవేక్షిస్తూ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

భావోద్వేగానికి గురైన శ్రీనివాసరెడ్డిని ఓదారుస్తున్న చంద్రబాబు

మహానాడు సూపర్ సక్సెస్.. శభాష్ వాసు

అభినందించిన చంద్రబాబు
శ్రీనివాసరెడ్డి భావోద్వేగం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో నిర్వహించిన మూడు రోజుల మహానాడు గ్రాండ్ సక్సెస్‌గా ముగిసింది. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి రాత్రనకా, పగలనకా కష్టపడి అందరిని సమన్వయం చేసుకుంటూ మహానాడును గొప్పగా నిర్వహించారు. వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల వసతులను కల్పించారు. మహానాడు సక్సెస్ కావడంతో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. దీంతో శ్రీనివాసరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. కడపలో మహానాడు నిర్వహించి మమ్మల్ని గౌరవించిన పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జీవితాంతం కృతజ్ఞతలని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బహిరంగ సభ వేదికపై, తన మనసులో కలిగిన భావోద్వేగం మాటల్లో చెప్పలేనిదని, ఆ క్షణం కన్నీళ్లుగా బయటపడిందని తెలిపారు. ఇది తన వ్యక్తిగత గౌరవం కాదు కడప ప్రజల విశ్వాసానికి, తమ జిల్లాపై పార్టీకి ఉన్న గౌరవానికి చిహ్నామని చెప్పారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన బాధ్యత అన్నారు. ఇప్పుడే కాదు రోజూ కడప కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి కూడా ఉన్నారు.

దేశ సమైక్యతను కాపాడుకుందాం

- సమైక్యతా యాత్రలో సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుల, మతాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచిన ప్రజల ఐక్యతా స్ఫూర్తిని రానున్న కాలంలోనూ కొనసాగించాలని, దేశంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకించాల్సిందేనని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పహల్గాం దాడి, అనంతరం పాక్‌పై యుద్ధం, అమెరికా ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో గురువారం మదనపల్లిలో సమైక్యతా యాత్ర పేరుతో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్ నుండి నీరుగట్టువారిపల్లి, రామారావు కాలనీ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకూ కరపత్రాల పంపిణీ నిర్వహించగా సిపిఎం, ఇతర ప్రజా సంఘాల శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాదుల నుండి పర్యాటకుల్ని రక్షించటంలో కాశ్మీర్ ప్రజలు మతాలకు అతీతంగా ఉన్నారన్నారు. ఈ దాడిని అడ్డుపెట్టుకొని దేశంలోని కొన్ని శక్తులు ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే యత్నం చేస్తున్నాయన్నారు. అమెరికా తన అధిపత్యం కోసమే పాక్‌పై భారత్ యుద్ధంలో జోక్యం చేసుకుందని, అమెరికాకు మోడీ లొంగిపోవటం సరికాదని విమర్శించారు. భారతదేశంపై ఇతర దేశాల పెత్తనం దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం అన్నారు. పహల్గాం దాడి తర్వాత బిజెపి మంత్రులు ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేసే యత్నం చేశారన్నారు. కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరని అభివర్ణించటం తీవ్ర అభ్యంతరకరమని, అయినా ఆయా మంత్రులపై బిజెపి చర్యలు తీసుకోలేదని, సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం కూడా ఉగ్రవాదమేనని విమర్శించారు. బిజెపి ఇటీవల చేసిన తిరంగ్ యాత్ర దేశ సమైక్యతను సూచించే విధంగా కాకుండా, దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు పెంచే విధంగా ఉందన్నారు. కాశ్మీరీ ముస్లిములు మమ్మల్ని కాపాడారు అని బాధితులు చెప్పడాన్ని గుర్తు చేశారు. దేశంలో హిందువులు, ముస్లిములు, సిక్కులు ఇతర అన్ని మతాలు ఐక్యంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచారన్నారు. బిజెపి అటువంటి విధానాలు ప్రోత్సహిస్తోందన్నారు. ఉగ్రవాదానికి మతం లేదనేది పవన్ కళ్యాణ్ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.నరసింహ, పి.నాగరాజు, జి.రమణ, కె.చిన్నికృష్ణ, జయబాబు పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయులు సస్పెన్షన్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. పది పరీక్షల మూల్యాంకనంలో మార్కులు మొత్తం తప్పుగా పొందు పరిచారని వారిని సస్పెన్స్ చేశారు. గుర్రంకొండ జడ్‌పి హైస్కూల్ చీఫ్ ఎగ్జామినర్ త్రినాధరావు, అసిస్టెంట్ ఎగ్జామినర్ రామసముద్రం జడ్‌పి హైస్కూల్ ఎం.మోహన్, స్పెషలిస్టుగా వ్యవహరించిన రాయచోటి మోడల్ స్కూల్ పీడీ రేవతిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పునఃమూల్యాంకనంలో పెరిగిన మార్కులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పదవ తరగతి పరీక్షల మూల్యాం కనంలో జరిగిన తప్పిదంతో మార్కులు పెరిగాయి. పట్టణంలోని బలిజిపల్లెకు చెందిన ప్రయివేటు ఉపాధ్యాయుడు యానాది తన తనయుడు ఎద్దుల మోహిత్ నరేష్‌కు సాంఘిక శాస్త్రం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో మార్కులు తక్కువ వేశారన్న అనుమానంతో పునఃమూల్యాంకణానికి దరఖాస్తు చేసుకున్నారు. పునఃమూల్యాంకనంలో సాంఘిక శాస్త్రంలో 8 మార్కులు పెరిగి 100 రాగా, ఇంగ్లీషులో 22వ ప్రశ్నకు సరైన సమాధానం రాసినప్పటికీ దాన్ని తప్పుగా కొట్టివేశారు. ఆ విద్యార్థి 2 మార్కులు కోల్పోయి స్కూల్ టాపర్‌గా రావలసిన అవకాశం కోల్పోయాడు. తన తనయుడు మోహిత్ నరేష్‌కు జరిగిన అన్యాయంపై ప్రభుత్వ పరీక్షల నిర్వహణ డైరెక్టర్ విజయవాడ వారికి విద్యార్థి తండ్రి యానాది గురువారం తపాలా ద్వారా రాతపూర్వకంగా ఫిర్యాదు పంపించారు. చివరకు పరీక్షల నిర్వహణ అధికారి అయినా తమకు న్యాయం చేయకపోతాడా అని వారు ఆశా భావం వ్యక్తం చేశారు.

బస్సుల్లేక..ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి-పీలేరు

బస్సుల్లేక జనంతో పీలేరు ఆర్టీసీ బస్టాండు నిండు కుంది. ఇదే అదునుగా భావించిన ప్రయివేటు వాహన దారులు బస్టాండు బయట ప్రయాణకుల్ని ఎక్కించు కుంటూ పండుగ చేసుకు న్నారు. గురువారం కడపలో జరిగిన మహానాడు కార్యక్రమానికి జనాన్ని తరలించడం కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు ఆర్టీసీ బస్సుల్ని అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. తమ అవసరాలకోసం ఊళ్లకు వెళ్లాలనుకున్న ప్రయాణీకులు గంటల కొద్దీ బస్టాండులో ఎదురు చూసినా బస్సులు లేక, రాక పోవడంతో ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక చేసేది లేక తప్పనిసరి పరిస్థితుల్లో వారు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి, అదనపు ఛార్జీలు చెల్లిస్తూ తమగమ్యాలకు చేరుకున్నారు.

బస్టాండులో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

డ్రోన్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న కెవికె సమన్వయకర్త మంజుల

యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రైతులు పండించే పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని కలికిరి కెవికె సమన్వయకర్త మంజుల అన్నారు. గురువారం మండలంలోని చారావాండ్లపల్లిలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 12వ తేది వరకు రైతుల వద్దకు వెళ్లి ఖరీఫ్‌లో పాటించాల్సిన సాగు పద్ధతులను, నూతన సాంకేతికతను వివరించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా అడవి పందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రోన్ వాడకం, వేరుశెనగ, వరి తదితర వాటిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సుధీర్, ఆత్మ బిటిఎం అమృత్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మదనపల్లె మండల సమావేశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నేడు అనగా శుక్రవారం ఉదయం 11:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాజ్ మస్రూర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎర్రబల్లి రెడ్డెమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనము నందు సమావేశం జరుగుతుందన్నారు. కావున మండల అధ్యక్షులు, మండల ఉపాధ్యక్షులు, జిల్లా ప్రాదేశిక నియోజక వర్గపు సభ్యులు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో హిజ్రాల కోసం స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, అర్హులైన హిజ్రాలు దరఖాస్తు చేసుకోవాలని ప్రతిభావంతుల, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సచాలకులు ఆర్.వి.కిశోర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్, బ్యూటీ షియన్, కారు డ్రైవింగ్ వంటి విభాగాల్లో తర్ఫీదు ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ తీసుకోవాలనుకునే ఆసక్తిగల హిజ్రాలు తమ వివరాలతో కొత్త కలెక్టర్‌లోని డి బ్లాక్‌లో వైఎస్ఆర్ కడప జిల్లాలో జూన్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. హిజ్రాల గుర్తింపు ధ్రువపత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

మరుగుదొడ్డిని వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని తహశీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్డిని నిర్మించారు. ఆ గదిని వినియోగంలోనికి తీసుకురాకుండా తాళాలు వేశారు. ఇటీవల కురిసిన గాలి, వానకు మరుగుదొడ్డి పైకప్పు రేకులు లేచిపోయి కింద పడ్డాయి. ప్రతి రోజూ తహశీల్దార్ కార్యాలయానికొ ఏదో ఒక మహిళలు వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో మరుగుదొడ్డికి వెళ్లేందుకు వీలులేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మరుదొడ్డికి పైకప్పుకు వేయించి, కుళాయిలను ఏర్పాటు చేసి నీటి వసతిని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మదనపల్లి జిల్లా హామీని గాలికొదిలేశారు

ప్రజాశక్తి-కలికిరి

ముఖ్యమంత్రి చంద్రబాబు మదనపల్లి జిల్లా హామీని గాలికి వదిలేసారని ఉమ్మడి రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం, ఇది చేస్తాం. అంటూ సూపర్ సిక్స్ హామీలతో పాటు మదనపల్లిని జిల్లా చేస్తామని స్వయంగా ప్రకటించిన చంద్రబాబు ఏమీ చేయలేక, జిల్లా హామీని కూడా గాలికి వదిలేశారని అన్నారు. చిత్తూరు జిల్లాలో ఉన్నటు వంటి పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గంను రాజకీయ దురుద్దేశంతో అన్నమయ్య జిల్లాలో విలీనం చేయడంలో ఉన్న శ్రద్ధను, మదనపల్లి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక పోతున్నారని అన్నారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నారా లోకేష్ పాదయా త్రలోనూ అనేక వాగ్దానాలతో పాటు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపే మదనపల్లిని జిల్లా కేంద్రంగా మారుస్తామని చెప్పిన మాటలు వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మదనపల్లి జిల్లా కేంద్రంగా ఎప్పుడు ప్రకటిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మచ్చలేని నాయకులు గా ఎదుగు తున్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించడం, బురద చల్లడం, వ్యక్తిగత, కక్ష సాధింపులు చర్యలు మానుకోవాలన్నారు.

మాతంగ పీఠం మాదిగల సంస్కృతికి నిదర్శనం

- కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లె కేంద్రంగా ఏర్పాటు చేసిన మాతంగ పీఠం దక్షిణ భారత రాష్ట్రాల మాదిగలకు కేంద్రంగా మారుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖ, పార్లమెంటు వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ అన్నారు. మండలంలోని దేవర చెరువు సమీపాన శ్రీ మాతంగ మహా పీఠ శిలా శాసన ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మురుగన్ మాట్లాడారు. తొలిసారిగా మాతంగ మహా పీఠం నిర్మాణం ప్రారంభం హర్షణీయమన్నారు. కర్ణాటక రాష్ట్ర ఆహార, ప్రజా సరఫరాల మంత్రి కె హెచ్.మునియప్ప మాట్లాడుతూ మఠాలు ప్రజలకు సంస్కారం నేర్పిస్తాయని,సరైన విద్యా బోధన సన్మార్గానికి మూలమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి దామోదర రాజనరసింహ, గన్నవరం భువనేశ్వర పీఠాధిపతి కమలా నంద భారతి మహాస్వామి, బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమం విరజా నందస్వామి, మాతంగ మహాపీఠాధిపతులు నందగిరి మహాస్వామి పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ఒరిగింది శూన్యం : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమని, టిడిపి గొప్పలు చెప్పుకోవడానికే మహానాడు పరిమితమైందని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్కె.బాషా అన్నారు. గురువారం తన కార్యాలయంలో అయన మాట్లాడుతూ మహానాడు వేదికగా ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలను చెప్పుకోలేని పరిస్థితిలో నాయకత్వం ఉందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీని విమర్శించడానికే కడపలో మహానాడును నాయకులు వేదికను చేసుకొన్నారని అన్నారు. దీని వల్ల రాష్ట్ర ప్రజానీకానికి ఒరిగిన ప్రయోజనం శూన్యమన్నారు. ఆర్‌టిసి బస్సులు అన్ని మహానాడు కు మళ్లించడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. కీ.శే.తారక రామారావు సొంత జిల్లాలో మహానాడు ఏర్పాటు చేసి, అయన ఆశయాలకు ఊపిరి పోసి ఉంటే ప్రజలు హర్షించేవాంని అన్నారు. అధికార పార్టీ ప్రతిపక్షంపైన నిప్పులు చెరుగుతూ ఎవరిని వదలి పెట్టబోమని హెచ్చరించడం,ప్రతిపక్షం అందరి పేర్లు బుక్కులో రాసుకోండి వడ్డీతో సహా చెల్లిస్తామని పేర్కొనడం చూస్తుంటే ప్రజల అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలుతో పాటు సీమలో సస్య శ్యామలం చేయడానికి సాగునీటి ప్రాజెక్టులు పురోగతిపైన ప్రభుత్వ వైఖరి వెల్లడించాలన్నారు. ముస్లిం మైనార్టీల అభివ ృద్ధి గురించి ఏమి చేయబోతున్నారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రాజువారిపేట ఆంజనేయ స్వామి దేవాలయం 18వ వార్షికోత్సవాన్ని గురువారం స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, చెక్కభజన వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తుల కోసం అన్నదానం చేశారు. ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతి అందజేశారు.

ఇంటి పన్నును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మేజర్ పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను చెల్లించే ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యాలయానికి వచ్చి అనుసంధానం చేసుకోవచ్చని సూచించారు.

జనగణనలో కులగణననూ చేపట్టాలి

- జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి యాదవ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన కూడా చేపట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌతమ బోయిన గురుమూర్తి యాదవ్ కోరారు. గురువారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన జాతీయ బిసి సంక్షేమ సంఘ ఆత్మీయ సమావేశంలో ఆయన బిసిల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. బిసిలకు రావలసిన వాటాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బిసిల అభ్యున్నతికి రూ.రెండు లక్షల కోట్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. బిసిల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ :వైఎస్ రాజారెడ్డి శతజయంతి సందర్భంగా వైసిపి నాయకుడు పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజారెడ్డి సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. రైతుగా, సామాజిక సేవకుడిగా ఆయన జీవితం మనందరికీ ఆదర్శమన్నారు. పేదలకు, అణగారిన వర్గాల వారికి ఎల్లప్పుడూ సహాయం చేయడానికి ముందుండేవారన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, ఆదినారాయణరెడ్డి, చంద్రమౌళి, రవి, రవిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల సంతలో కనీస వసతులు కరువు

- మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలు
- వర్షం వస్తే వ్యాపారాలు బంద్

కూరగాయాలు విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని కూరగాయల సంత, బస్టాండు, గొర్రెల సంత పంచాయతీకి ఆదాయం వచ్చే ముఖ్య వనరులు. 2025-2026 సంవత్సరానికి గాను పంచా యతీకి రూ.43.90లక్షలు ఆదాయం సమకూరనుంది. మండలంలో 17 గ్రామాలు ఉన్నాయి. అందులో మేజర్ పంచాయతీ గాలివీడు. ప్రతి బుధవారం కూరగాయలు సంత జరుగుతుంది. రైతులు, వ్యాపారస్తులు, మహిళలు దాదాపు ఐదు బజార్లలో 200 పైగా దుకా ణాలు ఏర్పాటు చేసుకున్నారు. మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. గేటు పన్ను వసూలు చేసే పంచాయతీ అధికారులు మౌలిక వసతుల కల్పించడం విఫల మయ్యారని చెబుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు చాలా ఇబ్బందులు పడుతు న్నారు. వ్యాపారస్తులతో పాటు సంతకు వచ్చే మహిళలు సైతం అత్యవసర పరిస్థితిలో చాలా ఇబ్బంది ఉందని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మార్కెట్ యార్డులో మాదిరిగా పైన రేకులు ఏర్పాటు చేయకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే సంతలోకి అడుగు పెట్టాలంటే అంతా బురద మయంగా మారి పోతుందని, కూరగా యాలు తడిచిపోయి వ్యాపారం చేసుకునేందుకు వీలు లేకుండా పోతోం దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా పంచాయతీ అధికారులు, మండలస్థాయి అధికారులు దృష్టిపెట్టి కూరగాయల సంతకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

యోగాకు పటిష్ట ఏర్పాట్లు : జెసి

అధికారులకు సూచనలు ఇస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో శనివారం నిర్వహించే యోగాకు పటిష్టమైన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను జెసి ఆదర్శన్ రాజేంద్రన్ ఆదేశించారు. యోగా ఏర్పాట్ల పై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కలెక్టర్ శ్రీధర్ హాజరవుతారని అన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, అందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సౌమ్యనాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టూరిజం అధికారి నాగభూషణం, ఎంపిడిఒ రాధాకృష్ణంరాజు, ఇఒఆర్‌డి సునీల్‌కుమార్, డాక్టర్ కార్తీక్‌విశ్వనాథ్, ఎంఇఒలు అనంతకృష్ణ, నాగయ్య, ఎఒ మల్లికార్జున, ఎపిఒ మురళి, ఎపిఎం శ్రీహరి పాల్గొన్నారు.

పప్పు ధాన్య పంటలు సాగు చేసుకోవాలి

మాట్లాడుతున్న జయరాణి

ప్రజాశక్తి-రామాపురం

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు ప్రధాన పంటలతో పాటు పప్పు ధాన్య పంటలు సాగు చేయాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు సేవా కేంద్రంలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు వారి ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ జివి.వీరయ్య మాట్లాడుతూ ఖరీఫ్‌లో ప్రధాన పంటల రకాలు వరిలో ఉల్లికోడు, యాజమాన్య చేయవలసిన పద్ధతులు, మామిడిలో పండు ఈగను కాయ తొడుగులు, ఎర్ర బుట్టలు పెట్టుకోవడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నూనె గింజల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బసవరాజ్ మాట్లాడుతూ ఆముదం, ప్రొద్దుతిరుడు, కుసుమలు, నువ్వు పంటలో అధిక దిగుబడులు ఇచ్చే రకాల గురించి వివరించారు. డాక్టర్ వి.శిల్పకళ మాట్లాడుతూ వేరు శనగలో తెగుళ్ళకు తట్టుకునే రకాలైన విశిష్ట, కదిరి, లేపాక్షి వేసుకోవాలని సూచించారు. పంట సాగుకు ముందు విత్తన శుద్ధి తప్పక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు ముఖాముఖి అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

'చమర్తి' ఆధ్వర్యంలో బహిరంగసభకు టిడిపి శ్రేణులు

టిడిపి శ్రేణులతో చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడపలో జరిగిన మహానాడు భారీ బహిరంగ సభకు టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు.నియోజకవర్గ వ్యాప్తంగా 1400 వాహనాలు బస్సులు, కార్లు, ఆటోలు, ఇతర సొంత వాహనాలలో నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభకు వెళ్లారు. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని రాజంపేట పట్టణం, రాజంపేట రూరల్, నందలూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం సుండుపల్లి, వీరబల్లి, మండలాల అత్యధికంగా కార్యకర్తలతు పాల్గొన్నారు. సుండుపల్లి, వీరబల్లి మండలాల నుంచి రాయచోటి మీదుగా హాజరైనట్లు తెలిపారు రాజంపేట క్రీడా మైదానం నుంచి జెండా ఊపి చమర్తి వాహనాలను చమర్తి ముందుకు కదిలించారు. మాధవరం ఉప్పరపల్లి వద్ద తిరుపతి వైపు రోడ్డు మార్గాన మహానాడుకు విచ్చేస్తున్న 70వేల మందికి మందికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడు చివరి రోజు జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారని అన్నారు. నాడును విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.

5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ నిర్వహణకు సిద్ధం

-కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ నిర్వహణకు సిద్ధం కావాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, జిల్లాలో వన మహోత్సవ నిర్వహణ, తడి భూములు తదితర అంశాలపై, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, డిఎఫ్ఒ జగన్నాథ్‌సింగ్ సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ జిల్లాలో తడి నేలలు ఎక్కువగా ఉన్నాయని తడి నేలల కమిటీలోని సభ్యులందరూ సంబంధిత నివేదికలను వెంటనే అందించాలని కోరారు. జిల్లాలో అటవీ శాతంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో వివిధ విషయాలు చర్చించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ శాతాన్ని పెంచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవానికి సంసిద్ధం కావాలని వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెసి ఆదర్శరాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లె వద్ద ట్రాక్టర్‌తో సేద్యం చేపడుతున్న రైతు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- తొలకరి చినుకులతో దుక్కులు చేపడుతున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

గత వారంలో తొలకరి చినుకులు పలకరించడంతో రైతన్నలు దుక్కులు చేపడుతూ ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి దాదాపు పొలాలు పదునెక్కాయి. రైతులు సేంద్రియ ఎరువులు పొలాలకు తోలుకుంటూ, పిచ్చిమొక్కలు తొలగిస్తూ దుక్కిళ్ళు చేపడుతున్నారు. పసుపు సాగు చేసే రైతులు విత్తన సేకరణలో నిమగ్నమయ్యారు. వరి సాగు చేసే రైతులు పచ్చిరొట్ట ఎరువుల సాగుకు సిద్ధపడుతున్నారు. విత్తనాలు రైతులు సిద్ధం చేసుకుని సాగు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట ఎరువులు విత్తనాలు ఎరువులు సబ్సిడీతో ఇప్పటివరకు పంపిణీ చేపట్టలేదు. జూన్ మొదటి వారంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధి కారులు తెలుపుతున్నారు. నియోజకవర్గ పరిధిలో కేసీ కాలువ కింద 45వేల ఎకరాల్లో వరి సాగు అయ్యే అవకాశం ఉంది. బోర్లు, బావులు, చెరువుల ద్వారా మరో 22వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టే అవకాశముంది. నియో జకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో దాదాపు లక్ష ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉంది. తొలకరి చినుకులు రాకతో రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లు, కాడిఎద్దులతో దుక్కులు చేపడుతున్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-చాపాడు

పేద ఎస్‌సి, ఎస్‌టి కులాల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర గ్రామీణ ఉపాధి హామీ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మాల మహానాడు నాయకులు గురువారం కడపలో కలిసి వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఎన్ సుబ్బయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యా యం జరుగుతోందన్నారు. ప్రధాన సమస్యలను పరిష్కరించే వారే లేరన్నారు. కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను వారి అభివృద్ధికి కేటాయించాలన్నారు. అనంతరం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్క ఆనందబాబు, జాతీయ మాల మహానాడు నాయకులు గోర్ల అరుణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పూల మాల, శాలువులతో వీరిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, కార్యదర్శి చార్లెస్ పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి ఆలయంలో కన్నా లక్ష్మీనారాయణ

సౌమ్యనాథుని సన్నిధిలో 'కన్నా'

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిననందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి వారిని మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం దర్శించుకున్నారు. తోట కేదారినాథ్ బాబు ఆధ్వర్యంలో శ్రీ శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, కూటమి నాయకులు చక్రాల సాయినాథ్, కొట్టే శ్రీహరి, మస్తాన్ రాయల్, గురువిగారి వాసు, అరుణ్ పాండే, ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి-వీరబల్లి

అత్యంత ప్రసిద్ధి చెందిన వంగిమళ్ళ ఎల్లమ్మ జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. మండలంలోని వంగిమళ్ళ, డి.రాచపల్లి పంచాయతీ పెద్దూరు కస్పాలో రెండు గ్రామాల ప్రజలు మూడు రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ మూడు రోజులు జరిగే జాతర కోసం ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తారు. అమ్మవారిని పల్లకిలో 16 గ్రామాలలో ఊరేగిస్తారు. ప్రతి కుటుంబం భక్తి శ్రద్ధలతో అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి మొక్కలు తీర్చుకున్నారు.మూడు రోజులపాటు డప్పు వాయిద్యాలు, కోలాటాలు, చాందిని బండ్లు, డిజె వాయిద్యాల మధ్య అమ్మవారిని ఊరేగిస్తారు. ఆదివారం బోనాల సమర్పించి భక్తి శ్రద్ధలతో మొక్కుబడులు తీర్చుకుంటారన్నాని తెలిపారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బివైయు నాయకులు

పట్టణంలోని మున్సిపాలిటీ స్థలంలో నిర్వహించే వారపు సంతలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఏర్పాటు చేసిన గోడౌన్లు, షెడ్లపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బివైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను, కూరగాయలను,వివిధ ఆహార వస్తువులను, రైతులకు సంబంధించిన పని ముట్లను అమ్ముకుని రైతుకు ఉపయోగపడే వ్యాపార కేంద్రాలుగా ఉండాలనే ము ఖ్య ఉద్దేశంతో ప్రభుత్వ స్థలాలను కేటాయించిందని అన్నారు. కేవలం గేటు మాత్ర మే వసూలు చేయిస్తూ వారపు సంతలను నిర్వహిస్తున్నారన్నారు. మున్సి పాలిటీ స్థలంలో నిర్వహిస్తున్న వారపు సంతలో ప్రభుత్వ నియమ, నిబంధనలకు తిలో దకాలిచ్చిన దళారులు, వ్యాపారస్తులు మున్సిపల్ యాక్ట్ కు విరుద్ధంగా పెద్దపెద్ద షెడ్లు, గోడౌన్లను నిర్మిస్తున్నారన్నారు. అంతేకాకుండా వాటికి అక్రమంగా విద్యుత్ మీటర్ కనెక్షన్లు కూడా తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని అన్నారు. మరికొందరైతే ఏకంగా ఆ షెడ్లను బాడుగులకు ఇచ్చి సొమ్ము చేసుకుంటూ మున్సి పల్ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోవడానికి స్థలం లేకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం నీరుకారుతోందన్నారు. వారపు సంతలో షెడ్ల నిర్మాణానికి ఏ అధికారులు అనుమతి ఇచ్చారో వారిపై లోకాయుక్తకి వెళ్లి చర్యలు తీసుకునే విధంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు శ్రీనివాసులు, జిలాని, శ్రీనివాసులు, శశి కుమా ర్, వినయ్, నితీష్, బ్రహ్మ, నిజాంబాషా, శశి, గౌతమ్, రాజేష్, దేవేష్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుదాఘాతానికి గురైన టిడిపి కార్యకర్త కిరణ్ కుమార్ రెడ్డిని అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బిసిసంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. నగ రంలోని ఓ ప్రైవేటు సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్ కుమార్‌ను కమ లాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డితో కలిసి ఇన్‌ఛార్జి మంత్రి గురువారం పరా మర్శించారు. ప్రమాదం జరిగిన తీరును కిరణ్ కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుమారుడు విద్యుత్‌దాఘాటానికి గురికావడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కిరణ్ కుమార్ రెడ్డి తల్లిని మంత్రి ఓదార్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అన్ని విధాలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల కింద ట తన ఇంటిపై టిడిపి జెండా కడుతుండగా కిరణ్ కుమార్ విద్యుద్ఘాతానికి గురయ్యాడని మంత్రి తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. తక్షణమే వెళ్లి కార్యకర్తను పరామ ర్శించాలని లోకేశ్ ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం కిరణ్ కుమార్‌కు మెరుగైన వైద్యమందిస్తున్నామన్నారు. ఇంకా అవసరమైతే మరింత వైద్య సేవల కోసం వేరే ఆసుపత్రికి తరలించే ఆలోచన చేస్తున్నామన్నారు. టిడిపి కార్యకర్త కిరణ్ కుమార్ కుటుంబానికి పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ, బైక్ ఢీ : భార్యాభర్తలకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

కడప-చెన్నై జాతీయ రహదారి రక్తదాహానికి గురువారం మరో మహిళ బలి అయింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని తొట్టికింద దళితవాడకు చెందిన సీమ రామ్మోహన్ భార్య సునీత తన పుట్టిల్లు పుల్లంపేట మండలం, అనంతంపల్లె పంచాయతీ, జానకిపురం వెళ్లాలని తన భర్తతో కలిసి బైక్‌పై బయలుదేరినట్లు తెలిపారు. పుల్లంపేట మోడల్ స్కూల్ సమీపంలోకి రాగానే కడప-రేణిగుంట జాతీయ రహదారిపై ఎదురుగా లారీ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో భార్యభర్తలు ఇద్దరూ గాయపడ్డారని తెలిపారు. సునీత తీవ్రంగా పడింది. ఎడమ చేయి పూర్తిగా నుజ్జు నుజ్జు అయినట్లు తెలిపారు. క్షతగాత్రులను హుటాహుటిన 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మోటర్ కేబుల్ వైరు చోరీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం, కురవపల్లిలోని తొమ్మిది మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్ మోటార్లలోని కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారని రైతులు తెలిపారు. భూమారపు రమణయ్య అనే రైతు రెండు బోర్ మోటార్ల కేబుల్ వైర్లను కట్ తీసెకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశ్శారు. వెంకటస్వామి గోరంట్ల పెద్దయ్య, గౌనిపల్లి వెంకటేశు, ఎం రెడ్డన్న, సుబ్బరాజా, నాగరాజా, వెంకటనాగులమ్మ బోర్ మోటార్ల వైర్లను దొంగలు కట్ చేసి తీసుకెళ్లారని రైతులు వాపోయారు. ఈ కేబుల్ వైర్ల విలువ సుమారు రూ.30 వేలు పైబడి ఉంటుందని రైతులు పేర్కొన్నారు. పోలీసులు నిందితులను గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు.